01ATP22_01ATP22.qxd 22-04-2025 PM 10:58 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 23 ఏప్రిల్ 2025 పేజీలు : 04

# గ్రామాల సమస్యలు నా దృష్టికి తీసుకురండి

- సమిష్టిగా కృషి చేయండి
- పార్టీ కమిటీలను సజావుగా ఎంపిక చేసుకోండి మంత్రి సవిత

ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి సవిత

పెనుకొండ ఏప్రిల్ 22 ప్రభాతవార్త

గ్రామాలలో నెలకొన్న ప్రతి సమస్యను తన దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ చేనేత జోలి శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. మంగళవారం పట్టణములోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో రొద్దం మండలం కు చెందిన కలిపి చిన్నమంతూరు పెద్దమంతూరు చోలే మరి నల్లూరు గ్రామ పంచాయతీల పరిధిలోని తెలుగుదేశం నాయకులు కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు వ్యక్తిగత సమస్యల కన్నా గ్రామాల సమస్యలపై నాయకులు కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు గ్రామాలలో నాయకులు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు ఇటీవల పార్టీ అధిష్టానం పార్టీ అనుబంధ సంస్థల కమిటీలను ఎంపిక చేయాలని ఆదేశించిందన్నారు ఈ మేరకు గ్రామాలలో పార్టీ కమిటీలను సమైక్యతతో సజావుగా ఎంపిక చేసుకోవాలన్నారు వైసిపి పార్టీ నాయకులు చేపట్టే దుష్ప్రచారాలపై ఎప్పటికప్పుడు ఖండించాలన్నారు తెలుగుదేశం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు సమావేశంలో పార్టీ పరిశీలకలు నరసింహారావు తెలుగుదేశం నాయకులు చిన్నప్పయ్య అశ్వర్థనారాయణ నరహరి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోటార్లకు మీటర్లు రద్దు కూటమి ఘనతే..!!

- రైతులకు నాణ్యతమైన విద్యుత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం - 4 కోట్లతో త్వరలో పెనుకొండ లో పోల్ సెంటర్ ప్రారంభం
- త్వరలో గోరంట్ల మండలంలో... మరో రెండు సబ్ స్టేషన్లకు భూమి పూజ చేయబోతున్నాం
- గోరంట్ల లో....అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ కార్యాలయ నూతన భవనంను ప్రారభించిన మంత్రి సవితమ్మ

రిబ్బన్ కత్తిరించి ప్రారంభిస్తున్న మంత్రి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవితమ్మ

గోరంట్ల ఏప్రిల్ 22 ప్రభాతవార్త

రైతులకు నాణ్యతమైన విద్యుత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యంమని మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం లో విద్యుత్ వ్యవస్థ ధ్వంసం అయ్యిందన్నారు. .గోరంట్ల మండల కేంద్రంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ కార్యాల్నయ నూతన భవనం ను ప్రారభించిన మంత్రి సవితమ్మ గారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ విద్యుత్ వ్యవస్థ విధ్వంసం చేశారని తెలిపారు.గత ప్రభుత్వం లో విద్యుత్ వ్యవస్థపై కక్ష పెట్టుకున్న జగన్ దానిని విధ్వంసం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనా అనుభవంతో అనతికాలంలోనే సరిదిద్దారని తెలిపారు. రైతులకు వ్యవసాయ అవసరాలకు 9 గంటలు నిరంతరాయ విద్యుత్ తో పాటు ప్రజలకు నాణ్యమైన

కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కరెంట్ ను ఎటువంటి అంతరాయాలూ లేకుండా కూటమి ప్రభుత్వం అందిస్తున్నామన్నారు.4 కోట్లతో త్వరలో పెనుకొండ లో పోల్ సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సౌర ఫలకాలను ఉచితంగానే అమర్చుతున్నామన్నారు. త్వరలో గోరంట్ల మండలంలో రెండు సబ్ స్టేషన్ లకు భూమిపూజ చేయబోతున్నా మన్నారు . ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మోటర్లకు మీటర్లు రద్దు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సురేంద్ర, డీ ఈ ,విద్యుత్ శాఖ అధికారులు మండల కన్వీనర్ సోమశేఖర్, బాచ్చన్న పల్లి బాలకృష్ణ చౌదరి, నరేష్, ఉత్తమ రెడ్డి, పచ్చ అశోక్, వృషభ, గుమ్మయ్య గారి పల్లి హరి, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనసేన మండలాధ్యక్షులు సంతోష్, ట్రాన్స్కో ఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

# ఇతర ప్రాంతాల నుండి ఎట్టి పరిస్థితుల్లో జిల్లాలోకి గంజాయి రాకూడదు

- జిల్లా ఎస్.పి. పి.జగదీష్

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

జాగిలంతో సూట్‌కేసు తనిఖీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ఇతర ప్రాంతాల నుండి ఎట్టి పరిస్థితుల్లో జిల్లాలోకి గంజాయి రాకూడదని జిల్లా ఎస్పి జగదీష్ ఆదేశించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు నార్కోటిక్స్ పసి గట్టడంలో శిక్షణ పొందిన జాగిలంతో మంగళవారం స్థానికంగా రైళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రైలు బోగీలు, అనుమానాస్పద వ్యక్తుల లగేజీలను షైనీ జాగిలం ద్వారా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతపురం త్రీటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ డాగ్ స్క్వాడ్ స్థానిక రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా అనంతపురంలో పోలీసులు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్స్ పసిగట్టడంలో సుశిక్షణ పొందిన షైనీ జాగిలం ద్వారా జిల్లా కేంద్రం గుండా వెళ్లే రైళ్లలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. ఒడిస్సాలోని భువనేశ్వర్ నుండి బెంగుళూరుకు అనంతపురం మీదుగా వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సాధారణ ప్రయాణీకులకు అసౌకర్యం కలుగకుండా ఈ తనిఖీలు కొనసాగాయి. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరగకుండా తనిఖీ చేశారు.

# జిల్లా జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్‌పి

అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా జడ్జి భీమారావును జిల్లా ఎస్‌పి పి.జగదీష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో వున్న నూతన జడ్జికి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. బాధిత ప్రజలకు న్యాయం, నిందితులకు శిక్షలు పడేలా ఇరు శాఖల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పని చేద్దామని, ఇరు శాఖల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొనేలా సమన్వయంతో ముందుకెళ్దామని జిల్లా జడ్జి, ఎస్‌పిలు ఆకాంక్షించారు.

◄ జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న జిల్లా ఎస్‌పి

# ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయని చరిత్ర వైసీపీది

- ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు - వైసీపీపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం
- ఇచ్చిన మాటల ప్రకారం 16,346పోస్టులు భర్తీ చేస్తున్నారు
- మంత్రి నారా లోకేష్‌కు విద్యార్థుల తరుపున కృతజ్ఞతలు తెలిపిన దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయలేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. ప్రభుత్వం మోగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినం రోజున నిరుద్యోగులకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన గిఫ్ట్ ఇది అని ఆయన అభిప్రాయపడ్డారు. గత ఆరేళ్లు ఉపాధ్యాయ పోస్టులు ఎప్పటికైనా సాధించాలనే కలతో ఎంతో మంది నిరుద్యోగులు వేచి చూశారని, కానీ నోటిఫికేషన్లు విడుదల కాక నిరాశతో గడిపారన్నారు. ఎంతో మంది కోచింగుల కోసం ఉద్యోగాలు లేక తల్లిదండ్రులకు భారంగా ఉండలేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పుడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఈ ప్రభుత్వం నిరుద్యోగులకు వరంలా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం

అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

16,346పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఇదే ప్రాంతంలో నిరసనలు, ధర్నాలు చేపట్టామని, కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. పైగా వారిపై కేసులు పెట్టించే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పుడు నిరుద్యోగులకు కలల సాకారం చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేయాల్సిందిపోయి వైసీపీ నాయకులు ఇంకా సిగ్గు లేకుండా విమర్శలు చేస్తున్నారని దగ్గుపాటి ధ్వజమెత్తారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో నిరుద్యోగుల ఇబ్బందులను నేరుగా చూశారని అప్పటి నుంచే ఒక కచ్చితమైన ప్రణాళికతో ఉన్నారన్నారు. భవిష్యత్‌లో 25లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేష్ పని చేస్తున్నారని ఇప్పటికే రాష్ట్రానికి అనేక పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చారన్నారు. భవిష్యత్ లో యువతకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఈ ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

## జయంతి ఉత్సవాల నిర్వహణకు

# ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

శ్రీసత్యసాయి జిల్లా. ఏప్రిల్ 22, ప్రభాతవార్త ప్రతినిధి:

భగవాన్ సత్య సాయి బాబా 100వ జయంత్యుత్సవ వేడు కలు ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ప్రభుత్వ యంత్రాంగం తరపున ముందస్తు ప్రణాళిక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయసారథి, సత్య సాయి బాబా ట్రస్ట్ సభ్యులతో కలిసి బాబా ఉత్సవాలపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం నవంబర్ మాసం లో జరగను న్న శ్రీ సత్య సాయి బాబా జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయని తెలిపారు. అలాగే వేడుకల్లో పాల్గొనేందుకు భారత దేశ ప్రధాని కూడా రానున్న తరుణంలో పకడ్బందీగా అన్ని ఏర్పాట్ల చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ,పోలీసు, శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులతో జిల్లా అధికారులు సమన్వయ సహకారాలతో తమకు అప్పగించిన పనులను ఆయా శాఖల ద్వారా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమాలలో చేపట్టవలసిన పనులకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులతో సమీక్షిస్తూ పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. పుట్టపర్తి విమానా శ్రయలో ప్రత్యేక హెలిప్యాడ్ ల ఏర్పాటుతో పాటు అదనంగా హైలిప్యాడ్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాల గుర్తింపు, భద్రతా చర్యలు ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు, రవాణా సేవలు, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటి సౌకర్యం, పట్టణ సుందరీకరణ పనులు, భక్త జనుల కోసం తాత్కాలిక బస్సు స్టేషన్లఏర్పాట్లు, తాత్కాలిక వసతి, మొబైల్ టాయిలెట్స్, చిత్రావతి నది సుందరీకరణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ ఉత్సవాలపై సమీక్ష సమా వేశాలు నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స వైద్య శిబిరాల ఏర్పాటు, పంచాయితీ మరి యు మున్సిపల్ శాఖ ద్వారా పారిశుద్ధ్య పనులు, పార్కింగ్, విద్యుత్తు మరియు త్రాగునీటి సరఫరా లాంటి తదితర లాంటి ముఖ్య విభాగాల ద్వారా సేవలందించాల్సి ఉం టుందన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో చేపట్ట వలసిన పనులు కూడా ప్రణాళికాబద్ధంగా నిర్వర్తించా లని కలెక్టర్ సూచించారు. డిఆర్ఓ నేతృత్వంలో కంట్రో ల్ రూమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకొని ఎప్పటికప్పుడు ప్రస్తుత పనులపై పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అలాగే హె ల్ప్ డెస్క్ ఏర్పాటుకు టూరిజం అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ ఆధ్వర్యంలో చిత్రావతి నది నందు గజ ఈతగాలను సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి మున్సిపాలిటీ అధికారులు పుట్టపర్తి ఆర్డిఓ పర్యవేక్షణలో కార్యక్రమాలు పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గౌరవ ప్రధానమంత్రి వచ్చి వెళ్లే వరకు చేయాల్సిన ఏర్పాట్ల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని అధికారు లందరూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ పుట్టపర్తి డిఎస్పి ఆధ్వర్యంలో బుక్కపట్నం కర్ణాటక నాగేపల్లి, ఫైర్ ఆఫీసు ఎదురుగా ఉన్న ప్రభుత్వ భూముల్లో వాహనాల పార్కింగ్ స్థలాల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.వేడుకలలో పాల్గొనే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చిన్న పొరపాట్లకు తావివ్వరాదన్నారు. విధుల్లో ఏవైనా సమస్యలు ఉంటే ఇప్పటి నుండే జాగ్రత్తగా వాటిని పరిశీలించుకుని పరిష్కార మార్గాల చర్యలు చేపట్టాలన్నారు. జయంతి ఉత్సవాలకు హాజరయ్యే భక్తజనులకు మరియు సామాన్య ప్రజలకు అంతరాయాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, సత్య సాయి ట్రస్ట్ సభ్యులు చలం రోమల్, డి ఆర్ డి ఎ పి డి నరసయ్య, డిపిఓ సమత, పోలీసు, దేవాదాయ, విపత్తు నిర్వహణ, ఏపీ ఎస్పీడీసీఎల్, మత్స్య శాఖ, మున్సిపల్ తదితర సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు, వివిధ రకాల సేవలను పారదర్శకంగా ప్రజలకు అందించాలి

- ప్రజల నుండి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చే విధంగా పనిచేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం ద్వారా అందే వివిధ రకాల సేవలను పారదర్శకంగా ప్రజలకు అందించాలని, ప్రజల నుండి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చే విధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవిన్యూ భవనంలో జిల్లాలోని తహశీల్దార్లు, సివిల్‌సప్లై డిప్యూటి తహశీల్దార్లు, విలేజ్ సర్వేయర్లు, సంబంధిత అధికారులకు ఐవిఆర్ఎస్‌కు సంబంధించి కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వారికి దిశ, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రభుత్వ సర్వీసులు, పథకాలకు సంబంధించి ప్రజల నుండి వారి అభిప్రాయాన్ని ఐవిఆర్ఎస్ ద్వారా గత మూడు నెలలుగా సర్వే చేయడం జరుగుతున్నదని, ఐవిఆర్ఎస్ సర్వేలో భూ సర్వే నిమిత్తం రైతులకు నోటీసులు జారీ చేస్తున్నారా ఈ సేవకు సంబంధించి నిర్ణయించిన రుసుము కంటే రైతుల నుండి ఎక్కువ రుసుము వసూలు చేశారా, క్షేత్రస్థాయి పర్యటన చేసి మీరు నిర్ణయాలు తీసుకుంటున్నారా, ఇలాంటి ప్రశ్నలను భూ సమస్యకు సంబంధించి ప్రజలను అడగడం జరుగుతూ ఉంటుందని, ఇందులో మన జిల్లాలో కళ్యాణదుర్గం డివిజన్‌లో 37 మంది, అనంతపురంలో డివిజన్ 30 మంది, గుంతకల్లు డివిజన్ 14 మంది విలేజ్ సర్వేయర్లపై నెగిటివ్ ఫీడ్ బ్యాక్ రావడం జరిగిందని తెలిపారు. ఇలా కొంతమంది ఒక్క విలేజ్ సర్వేపై చాలా నెగిటివ్ ఫీడ్ బ్యాక్ రావడం జరిగిందని తెలిపారు. సివిల్ సప్లై సంబంధించి దాదాపు 17 నెగిటివ్ ఫీడ్ బ్యాక్‌లు రావడం జరిగిందని, ఎవరైతే ఎండియులు కార్డుదారుల నుండి అదనంగా డబ్బులు వసూలు చేసిన ఎండియులపై చర్యలు తీసుకోవాలని, అలాగే జాబ్ చార్ట్ ప్రకారం ప్రతి నెల అన్ని ఎండియుల్లో విచారణలు నిర్వహించాలని, ఐవిఆర్ఎస్ నెగిటివ్ ఫీడ్ బ్యాక్ ద్వారా వచ్చినటువంటి ప్రాంతానికి

హాజరైన అధికారులు

వెళ్లి ఎంక్వైరీ చేసి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా లబ్ధిదారునితో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడం జరుగుతున్నదని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, సర్వే ఏడి రూప్లానాయక్, ఏఎస్ఓ జగన్‌మోహన్, తహశీల్దార్లు, సిఎస్‌డిటిలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంజీఎం విద్యార్థులు

2 >>

## రూ. 2 కోట్లతో నీటి సరఫరా, ఎల్ఈడి లైట్లు : మున్సిపల్ చైర్మన్, కమిషనర్

## రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తోంది

## ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ సీనియర్ నేత విష్ణు వర్ధన్ రెడ్డి

4 >>

## సిసి కెమెరాలు ఏర్పాటులో వ్యాపారవేత్తలు భాగస్వామ్యం కావాలి

## మానవ జీవితాన్ని సుసంపన్నం చేయటమే గణపతి సచ్చిదానంద స్వామీజీ లక్ష్యం

## ఆరోగ్య సమాజ నిర్మాణమే లక్ష్యం - కలెక్టర్ టి.ఎస్. చేతన్

4 >>

02ATP27_02ATP27.qxd 22-04-2025 PM 10:31 Page 1



## రూ. 2 కోట్లతో నీటి సరఫరా, ఎల్ఈడి లైట్లు మున్సిపల్ చైర్మన్, కమిషనర్

పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

హిందూపురం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

హిందూపురం మున్సిపాలిటీకి ఎడిసి గ్రాంట్ కింద రిలీజ్ అయిన రెండు కోట్ల రూపాయల నిధుల్లో మొదటి విడదగా వచ్చిన నీటి సరఫరా కోసం పైప్ లైన్ల మెటీరియల్స్, ఎల్ఇడి బల్బులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నాయి. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ శ్రీనివాసులు కౌన్సిలర్లు సతీష్ కుమార్ తదితరులు సామగ్రిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ ఒక వారం రోజు లోపల మరిన్ని సామాగ్రి పరికరాలు దాదాపు 850 పైగా బల్బులు మున్సిపాలిటీ రానున్నాయని అన్నిటిని కూడా వారం రోజుల్లోపు పట్టణంలోని అన్ని వార్డులకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని అలాగే ఎక్కడ లీకేజీ తావు లేకుండా అన్నిటినీ కూడా మరమ్మతులు చేయించి నీటి సరఫరా మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఇందుకోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ప్రభాతవార్తకు తెలిపారు.

## సర్వేలు వేగవంతం చేయండి ఎంపిడిఓ నందకిషోర్

బ్రహ్మ సముద్రం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని సచివాలయం ల సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపి డి ఓ నంద కిషోర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ గ్రామాల యందు సిటిజన్ ఈ కే వై సి సర్వేలను వేగవంతం చేయాలని సిబ్బందికి అదేదించాడు అదేవిధంగా వేసవిని దృష్టి లోపెట్టుకుని గ్రామాలయదు త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

## కాళీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

బ్రహ్మ సముద్రం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

మండల కేంద్రం నందుగల కేజిబివి పాఠశాలయందు గ్రేడ్ 111 నందు అసిస్టెంట్ పోస్టులు 2.వాచ్ మెన్ పోస్ట్ 1. కలిగివున్నవి ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలనీ యం ఈ ఓ ఓబుల పతి పత్రికా ప్రకటనలో తేలి చేశారు.అభ్యర్థులకు వయో పరిమితి 01.07.2024.నాటికి 47 సంవత్సర ములు దాటకూడదు. యస్సి,ఎస్టీ, బీసీ,ఈడబ్లుయస్ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితి 47. సంవత్సరములు దాటకూడదు. వికలాంగులకు గరిష్టంగా వయోపరిమితి 52 సంవత్సరాలు. హెడ్ కుక్ మరియు అసిస్టెంట్ కుక్కలకు విద్యార్హతలు తప్పనిసరి కాదు. డే,/నైట్ వాచ్మెన్ కు ఏడవ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి కే జి బి. వి. ఉన్న నివాస స్థలంలో నివసిస్తున్న స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది వ్యక్తి యొక్క స్థానికత అనేది అభ్యర్థి యొక్క ఆధార్ కార్డులో ఉన్న వివరములు మాత్రమే పరిగణిస్తారు పైవిషయాలకు ఆసక్తికర అభ్యర్థులు 31.04.2025. తేదీలోపల దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఓబుల పతిపత్రిక ముఖంగా తెలియజేశారు

## తపాలా ఉద్యోగుల నిరసన

కంబదూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

నిరసన తెలుపుతున్న దృశ్యం

దీర్ఘకాలికంగా పరిష్కారం కానీ జీడీఎస్ గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలను వెంటనే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కంబదూరు మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం వద్ద తపాలా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర సంఘం పిలుపుమేరకు నిరసన వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టి మల్లేషయ్య, సుదర్శన్ రెడ్డి, టీ శ్రీనివాసుల తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## అన్యమతస్తులపై దాడులకు నిరసనగా ర్యాలీ

గుత్తి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

హిందువులు ర్యాలీ చేస్తున్న దృశ్యం

పశ్చిమ బెంగాల్ లో అన్యమతస్తులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం పలు హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యం లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మధు నవాదన్ గుప్తా మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సవరణను కారణంగా చూపించి ఆ రాష్ట్రంలో హిందువులపై అన్యమతస్తులు దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. అలాంటి వారికి రాజకీయంగా కొనసాగే నైతిక హక్కు లేదని విమర్శించారు. ర్యాలీ గాంధీచౌక్ నుండి ఆర్టీసి బస్టాండ్ రాజీవ్‌సర్కిల్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి, రమణ,రామకృష్ణ, గోపాల్,సురేష్,చిన్న, వెంకటేష్, నారాయణరెడ్డి, సంపత్, రామకృష్ణ, మురళి, చలం, నారాయణ, కూటమి నాయకులు, హిందూ ధార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలు లేని సమాజమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం...!

ధర్మవరం, ఏప్రిల్ 22(ప్రభాతవార్త)

మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజమే జేవీవీ లక్ష్యమని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ఆదిశేషు అన్నారు.పట్టణంలోని గణేశ్ మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం యురేకా సైన్స్ ఎక్స్ ఫో విజేతల అభినందనభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జేవీవీ నిర్వహించిన ప్రయోగాల ఆన్లైన్ వీడియో కంటెస్ట్ యురేకా సైన్స్ ఎక్స్పోలో గణేశ్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినిలు మేఘన. తేజస్వినిలు జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచారని పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. వీరిని హెచ్ఎం, జేవీవీ నాయకులు అబినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం జేసినీ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక మూడనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషిచేస్తోందన్నారు. జేవీవీ నైతిక విలువలతో కూడిన విద్య కోసం, ఆరోగ్యంకోసం, పర్యావరణ పరిరక్షణ కోసం, స్వావలంబన కోసం కృషిచేస్తున్న సంస్థ సైన్స్ అన్నారు. శాస్త్ర సాంకేతిక రం గాల్లో అభివృద్ధి చెందాలంటే పాఠశాలలు, కళాశాలల్లో అత్యాధునిక ప్రయోగశాలను అభివృద్ధి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జేవీవీ పట్టణ ప్రధానకార్యదర్శి నరేం ద్రబాబు, ఏపీటీఎఫ్ నాయకులు రవీంద్రారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు శేఖర్. గోపి । పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన విద్యార్థినిలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న దృశ్యం

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

సచివాలయ ఉద్యోగులతో ఉన్నత అధికారుల సమీక్ష సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీం భాష

కంబదూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త

హాజరైన సచివాలయ ఉద్యోగులు

కంబదూరు మండల పరిషత్ సమావేశపు భవనం నందు ఎంపిడిఓ గూడెన్న అధ్యక్షతన ఉపాధి హామీ పనులు , ప్రభుత్వ సర్వే ,పించన్ల మొత్తం జమ అంశాల పట్ల వివిధ శాఖాలకు చెందిన అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.. ఈ సమావేశానికి డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సలీం బాషా,డివిజనల్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరావులు హాజరయ్యారు..ఈ సమీక్షా సమావేశం లో వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు వివిధ అంశాల పై సేకరిస్తున్న సర్వే లో మండలం నుండి అధికారులు వెనుకబడి ఉన్నారని అన్నారరు.క్షేత్రస్థాయిలో సర్వే సక్రమంగా జరిగితే అటు లబ్ధిదారులకు మంచి చేకూర్చుతూ,ఇటు ప్రభుత్వానికి మంచి పేరు తేవడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన సర్వేలను పారదర్శకంగా చేపట్టాలని వారు సచివాలయ సిబ్బందికి సూచించారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందించే సర్వీస్ వివరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కోరారు. ప్రజలకు మెరుగన సేవలు అందించడంలో అధికారులు ముందు ఉండాలన్నారు .బాధ్యత గా విధులను నిర్వర్తించకపోతే ,తగిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఇందులో ఏఓ తిప్పయ్య తో పాటు ,వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గోరంట్ల మండల పల్లెల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

గోరంట్ల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని శేట్టిచిన్నవల్లి, పులేరు గ్రామాల్లో త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఉంట్లవారి పల్లి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వ్రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత, 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి ప్రచారం చేశారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సరం శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**శ్రీరామ అంటే అర్థం వివరణ :** "శ్రీ మోక్షం, రా జన్మ లేకుండా నశించడం, మ జీవుడు" కావున శ్రీరామ అంటే జీవుడు జన్మలు లేని వాడై దేవునిలోకి ఐక్యం కావడమని అర్థం అని తెలిపారు. కృతయుగం నుండి శ్రీరామ అనే పేరు వుండేదని మోక్షంను అర్థించే జ్ఞాన జిజ్ఞాసులు శ్రీరామ అనే పేరు పలికెడివారన్నారు. అలాగే పుట్టిన శిశువులకు ఆ పేరు పెట్టేవారన్నారు. త్రేతాయుగంలో శ్రీరాముడి వల్ల ఆ పేరు, అందులోని గొప్ప భావం ఇంకా ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చిందని, యుగాది పండుగ ఆధ్యాత్మిక రహస్యం ఉగాది అంటే యుగానికి ఆది అని, దేవుని చేత ఆదివారం సృష్టి ఏర్పడింది కాబట్టి మొట్టమొదటి పండుగ యుగాది అని తెలిపారు. పూర్వం ఉగాది రోజు ఆరు గుణాలకు ప్రతీకగా షడ్రుచుల ప్రసాదంను తయారుచేసి దైవం ముందర వుంచి మనిషిలోని గుణాల మాయను తీసివేసి మోక్షానికి దగ్గర చేయమని ప్రార్థించేవారు. తర్వాత భక్తితో ఉగాది ప్రసాదంను స్వీకరించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఉంట్లవారిపల్లి కమిటీ అధ్యక్షులు, సభ్యులు ఆదినారాయణ, రంగప్ప, రాజు, సునీత, జయలక్ష్మి, ఈశ్వరమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుంటలో దూకి బాలుడు మృతి

గుంతకల్లు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త



మృతి చెందిన బాలుడు ప్రణీత్

మండలంలోని ఓబులాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మైనాపురం గ్రామానికి చెందిన ప్రణీత్ (8) అనే బాలుడు ప్రమాదవశత్తు నీటి కుంటలో దూకి మృతి చెందాడు. ఆదినారాయణ, ప్రభావతి దంపతులకు ఇద్దరు కుమారులు వున్నారు. వీరిలో చిన్నబ్బాయి ప్రణీత్ మంగళవారం మధ్యాహ్నం వాళ్ళ నానమ్మ నారాయణమ్మతో కలిసి ఇంటికి దగ్గరలో వున్న పొలాల్లోకి వెళ్ళారు. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా పొలాల్లో తవ్విన నీటి కుంటలు వర్షపు నీటితో నిండిపోయాయి. అయితే బాలుడు ఈత రాకపోయినా తెలియనితనంతో ఈత కొడదామని వున్న ఫలంగా కుంటలోకి దూకాడు. ఘటనతో ఆందోళనకు గురైన బాలుడి నానమ్మ బిగ్గరగా కేకలు వేసేసరికి పక్కనే వున్న గొర్రెల కాపరులు బాలుడిని బయటకు తీశారు. హుటాహుటిన బాలున్ని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనుకోకుండా కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

## ఉపాధి పనుల్లో గాయపడిన ఉపాధి కూలీ

బెలుగుప్ప, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

కాలు విరిగిన గోవిందప్ప

మండల కేంద్రంలో కరువు ఉపాధి పనులకు వెళ్లిన డి.గోవిందప్ప పవన్ గ్రూపులో పనులు చేస్తుండగా గడారుతో తవ్వుతుండటంతో కాలు విరిగిందని అతని భార్య సువర్ణ తెలిపారు. ఉపాధి పనుల్లో పని చేస్తున్న కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కూడా కల్పించడం లేదని, ప్రభుత్వం అందిస్తున్న కనీసం నీరు, నీడ, ప్రథమ చికిత్స సైతం అందడం లేదని కూలీలు వాపోయారు. కాలు విరగడంతో కుటుంబ పోషించలేక ఇబ్బంది పడుతున్నామని భార్య తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు.

## నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుత్తి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలోని కెజిబివి పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బంది ఖాళీల భర్తీకై నోటిఫికేషన్ జారీ అయినట్లు మండల విద్యాశాఖ అధికారి రవినాయక్ తెలిపారు. ఒక అసిస్టెంట్ వంట మనిషి, ఒక స్వీపర్ పోస్ట్ ఖాళీగా వున్నాయన్నారు. ఆసక్తి వున్న వారు మే నెల 1వతేదీలోపు దరఖాస్తులను మండల విద్యాశాఖ కార్యాలయంలో అందచేయాలని ఆయన సూచించారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎంజీఎం విద్యార్థులు

హిందూపురం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

లోకేష్ బాబు

స్థానిక ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు వై.గగన శ్రీ (8వ తరగతి) పి.లోకేష్ బాబు (7వ తరగతి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ 14 బాల బాలికల ఫుట్బాల్ జట్టుకు ఎంపికై తన జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటున్నారు. ఇటీవల హిందూపురంలో ఎంజిఎం హై స్కూల్ నందు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించారు. వీరు ఈనెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు మహారాష్ట్ర లోని కొల్హాపూర్ నందు నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన క్రీడాకారులను పీడీలు లోకనాథ్, సురేష్, విలియం, రాణి, ప్రవీణ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

## క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే హెచ్ఎంఐఎస్ ఫార్మెట్‌లో పొందుపరచాలి

కళ్యాణదుర్గం టౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:

ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం.

వైద్య సిబ్బంది తాము నమోదు చేసే గణాంకాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే హెచ్ ఎంఐఎస్ ఫార్మేట్‌లో పొందుపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ నందు రెవెన్యూ డివిజన్ లో ఉన్న అన్ని పిహెచ్‌సీ, యూపిహెచ్‌సి వైద్య సిబ్బందికి మంగళూవరం హెచ్ఎంఐఎస్ మరియు ఆర్‌సిహెచ్ పోర్టల్ నిర్వహణ పై ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం డిప్యూటి ఏఎస్ఓ నాగేంద్రప్రసాద్ సవీకరించిన హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఆయా ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న సేవలన్నిటినీ నమోదు చేయడం జరుగుతుందని, ఎటువంటి తప్పులు నమోదు చేయకుండా వారు అందిస్తున్న సేవలను హెచ్ఎంఐఎస్‌లో ఖచ్చితత్వంతో నమోదు చేయు విధంగా వివరిస్తూ శిక్షణా తరగతులను నిర్వహించారు. డాక్టర్ గీతాబార్గవి మాట్లాడుతూ ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో అందిస్తున్న ఆరోగ్య సేవలు, మాతా శిశు సంరక్షణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు వివరాలు, మాతా శిశు మరణాలు, క్వాలిటి కంట్రోల్ వంటి సేవల వివరాలను హెచ్ఎంఐఎస్‌లో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, బెళుగుప్ప, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల పరిధిలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సిహెచ్ఓలు, ఎంపీహెచ్ఈఓలు, సూపర్‌వైజరున్ల, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్స్, స్టాఫ్ నర్సులు, డిఈఓలు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం...!

ధర్మవరం,ఏప్రిల్22(ప్రభాతవార్త)

ధర్మవరం పట్టణంలోని పార్థసారధినగర్లో అక్రమంగా నిల్వఉంచిన 13 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని లోకేశ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. లోకేశ్ ధర్మవరం, ఇతర ప్రాంతాల నుండి రేషన్ బియ్యంను సేకరించి అధికధరలకు విక్రయించాలనే ఉద్దేశ్యంతోనిల్వ చేసిన 13 క్వింటాళ్ల రేషన్ బియాన్ని అనంతపురం కు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు, సిబ్బంది దాడులు చేసి లోకేష్ ను అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లోకేష్ పై కేసునమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

## మండలంలో మట్టి అక్రమ రవాణా దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి...సిపిఎం

డి.హీరేహాళ్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:

సిపిఎం మండల కార్యదర్శి ఎన్.లోకేష్ ఫైల్‌ఫోటో

మండలంలో మట్టివిచ్చలవిడిగా అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆధాయానికి గండి కొడుతున్నారని తక్షణమే అధికార యంత్రం స్పందించి మట్టి అక్రమ రవాణా దారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్. లోకేష్ డిమాండ్ చేశారు. అ నేపథ్యంలో మంగళవారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా రవాణా చేస్తూ అక్రమదారులు పెద్ద ఎత్తున దోపిడికి పాల్పడుతున్నారన్నారు. అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. ఇంత పెద్దఎత్తున ఈ మండలంలో మట్టి అక్రమంగా రవాణా చేస్తుంటే రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎందుకని చర్యలు తీసుకోలేకపోతున్నారన్నారు. మండల ప్రజానీకానికి సమాధానం చెప్పాలని సిపిఎం పార్టీ తరుపున ప్రశ్నిస్తున్నామన్నారు.

## క్షయవ్యాధి, వడదెబ్బపై అవగాహన కార్యక్రమం

క్షయ వ్యాధి వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సత్య సాయి జిల్లా వైద్యము ఏప్రిల్ 22 ప్రభాతవార్త

పుట్టపర్తి మండల పరిధిలోని బీడుపల్లిలో సామాజిక ఆరోగ్య అధికారి నాగేష్ ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధి (టుబర్కులోసిస్) మరియు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఒక్కరూ దాని లక్షణాలను గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉందని తెలిపారు.లక్షణాలు రెండు వారాలకు మించి దగ్గు గళ్ళ పడడం,ఛాతిలో నొప్పి,ఉదయం, సాయంత్రం జ్వరాలు,బరువు తగ్గడం, ఆకలి మందగించడం. లాంటి లక్షణాలు కనిపించిన ప్రతి ఒక్కరూ వెంటనే వైద్యులను సంప్రదించాల్సినదిగా సూచించారు. ప్రభుత్వం నుండి క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యం, పోషకాహార నిమిత్తం రూ. 6000 సాయం లభిస్తున్నదని తెలిపారు. అలాగే వారికుటుంబసభ్యులకు సివైటిబి పరీక్షలు నిర్వహించబడుతున్నాయని తెలియజేశారు.వడదెబ్బపై అవగాహన కల్పిస్తూ ఉదయం 10 గంటల లోపు లేదా మధ్యాహ్నం 3 గంటల తరువాత ప్రయాణాలు, పనులు చేసుకోవాలి. కాటన్ దుస్తులు ధరించాలి. చెప్పులు, గొడుగు, నీరు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. తరచూ నీరు, ఓఆర్ఎస్ ద్రావణం సేవించాలి. రోడ్లపై అమ్మే రంగు పానీయాలు, కలుషిత ఆహారం తీసుకోవరాదు.తాజా కూరగాయలు, పళ్లరసాలు, కొబ్బరి నీరు ఎక్కువగా తీసుకోవాలి మితంగా భోజనం చేయాలి.అస్వస్థతగా అనిపించిన వెంటనే ఆసుపత్రిని సంప్రదించాలి. పరిశుభ్రత పాటించడం ఎంతో ముఖ్యం.ఈ అవగాహన కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాధ, అనురాధ, టి బి హెచ్ వి రాజేశ్వరి మరియు ఆశా కార్యకర్తలు గులాబ్ జాన్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## డిప్లమా కోర్స్ నందు ప్రవేశం కొరకు నోటిఫికేషన్ విడుదల డిఇఓ జి కృష్ణప్ప

21 నుంచి ఆన్లైన్లో దరఖాస్తులు ప్రారంభం.

కొత్తచెరువు ఏప్రిల్ 22 ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లాలోని ప్రభుత్వ జిల్లా స్థాయి విద్య మరియు శిక్షణ సంస్థలు ,ప్రభుత్వ ప్రాథమిక ఉపాధ్యాయ శిక్షణ సంస్థలలో నిర్వహించబడు రెండు సంవత్సరముల ప్రాథమిక విద్యలో డిప్లమో కోర్సు నందు ప్రవేశం కొరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి జి కృష్ణప్ప ఓ ప్రకటనలో తెలిపారు ఈనెల 21వ తేదీ నుంచి https;//csc.ap.gov.in మరియు https://apdeecet.apcfss.in సైట్ నందు పొందపరచడ మైనది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత అయిన అభ్యర్థులు ఆసక్తిగల వారు దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకొని దరఖాస్తు చేసుకోవలసిందిగా కోరారు

## తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యలు.... మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఓ

సమావేశంలో మట్లాడుతున్న ఎంపిడిఓ దాస్‌నాయక్, సమావేశంకు హాజరైన ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల ఉద్యోగులు

డి.హీరేహాళ్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:

వేసవి కాలం పూర్తి అయ్యేదాకా మండల పరిధిలోని అన్ని పంచాయితీలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణం చర్యలు చేపడతామని ఎంపిడిఓ దాస్‌నాయక్ తెలిపారు. మంగళవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ, ఎంపిపి మల్లాపురం పవిత్ర అధ్యక్షతన సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తితే పంచాయితీ సర్పంచులు, కార్యదర్శులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సమస్యను సకాలంలో పరిష్కరిస్తామని ఆయన సూచించారు. తాగునీటి సమస్య పరిష్కారంకు అవసరమైన పరికరాలు పనిచేసే సిబ్బంది సిద్దంగా ఉన్నారని వేసవి ప్రారంభం నుండి తాగునీటి సమస్య రాకుండా గ్రామాల్లో క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారని సమస్య మా దృష్టికి వచ్చిన వెంటనే ప్రజలు తాగునీటితో ఇబ్బంది పడకుండా తక్షణం పరిష్కారం చూపుతున్నట్లు ఆయన చెప్పారు.

### రూ.440కోట్లతో శాశ్వత తాగునీటి పథకంకు ప్రతిపాధనలు.....

రాయదుర్గం నియోజకవర్గంలో శాశ్వత తాగునీటి పథకాలు ఏర్పాటుకు రూ.435కోట్ల నిధులతో ప్రతిపదనలు సిద్దం చేసి పంపినట్లు ఆర్డబ్ల్యుఎస్ డిఈ వెంకటేశ్వర్లు సర్వసభ్య సమావేశంలో సభ్యులకు తెలిపారు. ఈ పథకం రాష్ట్రం మొత్తం చేపట్టారని అందులో భాగంగా రాయదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు రాయదుర్గం మున్సిపాలిటి పరిధిలోను ఈ నిధులతో తాగునీటి పనులు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ప్రస్తుతం రూ.41కోట్ల నిధులతో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పనులు సాగుతున్నాయని త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఈ పథకంతో మండలంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన చెప్పారు.

### బస్తి, ఆదర్శ పాఠశాలల ఏర్పాటుకు శ్రీకారం.... ఎంఈఓ లక్ష్మన్న

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ విధానంలలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117జీఓను ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఉపసంహరించిందని మండల విద్యాశాఖ అధికారి లక్ష్మన్న సర్వసభ్య సమావేశంలో సభ్యులకు తెలిపారు. దీంతో మండలంలో బస్తి, దర్శ పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని, మండలంలో 60మంది విద్యార్థులు ఉన్న ముందస్తు పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులతో కలిపి 12బస్తీ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని పలు పంచాయితీల పరిధిలో 60మందికి పంచాయితీల పరిధిలో 60మందికి పైగా ఉన్న విద్యార్థుల సంఖ్యను అన

## పాఠశాల విద్యాశాఖ 8 రకాల పాఠశాలల ఏర్పాటు విధానాన్ని తక్షణమే విరమించుకోవాలి - ఏపీటీఎఫ్ నేతలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

గత ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణల పేరుతో జీవో 117తో ప్రయోగాలు చేసి విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేయడం జరిగిందని ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా చేస్తున్న పాఠశాల రిస్ట్రక్చర్ స్వరూపం గ్రామీణ విద్యారంగాన్ని మరింత బలహీనపరిచేలా ఉందని కావున ప్రస్తుత విద్యారంగంలో 5+5+2 విధానాన్ని మాత్రమే అమలు చేయాలని ఏపిటిఎఫ్ నేతలు పేర్కొన్నారు. మంగళవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 1 నుండి 5 తరగతుల ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మాత్రమే ఆమోదయోగ్యమని, ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 లేదా మండల కేంద్రంలో +2 వరకు ఉండాలి, సీనియార్టీ లిస్టులో భారీగా ఉన్న లోపాలను తక్షణమే సవరించాలని, గ్రేడ్-2 హెడ్మాస్టర్ల సీనియారిటీకి సంబంధించి ఉన్న లోపాలను సవరించాలని, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులను మాత్రమే నియమించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను యధావిధిగా కొనసాగిం చాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో అన్ని సబ్జెక్టులు బోధించుటకు పాఠశాల సహాయకులను నియమించాలని, హేతుబద్ధీకరణ సమర్థవంతంగా అన్నిటికీ సమానంగా చేపట్టాలని, పై తప్పిదాలను సవరించిన తర్వాతనే తదుపరి ప్రక్రియ కొనసాగించాలని, విద్యా హక్కు చట్టం ప్రకారము ప్రతి గ్రామంలో ఒక కిలోమీటర్ పరిధిలో ప్రాథమిక పాఠశాల మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాల ఐదు కిలోమీటర్ల లోపల ఉన్నత పాఠశాల ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, మైనర్ మీడియా పాఠశాలలలో విద్యార్థి ఉపాధ్యా య నిష్పత్తికి సంబంధం లేకుం డా ప్రాథమిక పాఠశాలలో ఇద్ద రు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలో ప్రతి సబ్జెక్టు ఒక ఉపాధ్యాయుని నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.నర్సింహులు ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా ఏడికి ప్రాతినిధ్యం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు పట్నం శ్రీనివాసులు, ఈశ్వరయ్య, తిప్పే స్వామి, హనుమంతు, రామాంజనేయులు, రంగానాయుడు, చిదంబ రయ్య, మన్సూర్, షేక్షావలి, ఆరిఫ్, ఖలీముల్లా, వీరాంజనేయులు, ఓబన్న తదిత రులు పాల్గొన్నారు

వినతిపత్రం అంద జేస్తున్న పిటిఎఫ్ నేతలు

## మందకృష్ణ మాదిగ పోరాటాల ఫలితంగా వర్గీకరణ సాధ్యం
### - ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్

శింగనమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు చేసిన పోరాటాల ఫలితంగా వర్గీకరణ సాధ్యమైందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం కోసం ఆర్డినెన్స్ విడుదల చేసిన సందర్భంగా శింగనమల ఇన్‌చార్జ్ చిన్న జలాలపురం ఓబులేసు మాదిగ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం వర్గీకరణ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పాల్గొన్నారు. మొదటి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. అనంతరం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా బండారు శంకర్ మాట్లా డుతూ.. భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ మాదిగలకు ఇచ్చిన మాట నిలుపుకునే క్రమంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయ కత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో వర్గీకరణకు అనుకూలంగా తరీఫ్పు వచ్చిందని, ఆ తీర్పును అనుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బా బు నాయుడు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయ డం సంతోషకర మన్నారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడుకి, డిప్యూ టీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి ధన్య వాదాలు తెలియజేస్తున్నా మన్నారు. 30 ఏళ్లపాటు ఎస్సీ వర్గీకరణ సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తూ నిబద్ధత తో పని చేసిన ఎమ్మార్పిఎస్ అధినేత మందకృష్ణ మాదిగకు మాదిగజాతి రుణపడి ఉంటా మన్నారు. 30 సంవ త్సరాల పాటు సుదీర్ఘ కాలం ఉద్యమంలో పనిచేసి ప్రాణత్యాగం చేసిన అమ ర వీరులకు ఎమ్మార్పిఎస్ కార్యకర్తలకు ఈ వర్గీకరణ ఫలితం అంకి తమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బండారు కదిరప్ప, ఎమ్మార్పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బం డారు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, బుక్కరాయ సముద్రం నరసింహులు, శింగనమల మండల అధ్యక్షులు సురేష్, పవన్‌కుమార్, ఎంఈఎఫ్ నేత డా.రాము, మురళీ, గురుగుంట్ల ఓబుళేసు, మహేష్, రవితేజ, అశోక్, దయాకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాల్లో ఎమ్మార్పిఎస్ నేతలు

## 8, 9, 10 తరగతులపై కోర్సులపై కరస్పాండెంట్లకు అవగాహన సదస్సు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

స్థానిక సంగమేష్ నగర్ నందు గల రఘు సైనిక్ స్కూల్‌లో కృష్ణ ప్రదీప్ 21 సెంచురీ ఐఎఎస్, ఐపిఎస్ అకాడమీ హైదరాబాద్ వారిచే 8, 9, 10 తరగ తులకు సంబంధించిన కోర్సులపైన కరస్పాండెంట్‌లకు ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమానికి స్వయం గా చైర్మన్ కృష్ణప్రదీప్, చీఫ్ మెంటర్ డాక్టర్ భవాని శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ. .రాష్ట్రంలో ఎన్నిక చేసుకున్న కొన్ని పాఠశాలలకు మాత్రమే మా కంటెంట్‌ను అందజేయనున్నామని కంటెంట్‌తో పాటు అవగాహన కుదుర్చుకున్న స్కూల్స్ వారికి ఐఎఎస్, ఐపీఎస్ లాంటి కాంపిటేటివ్ పరీక్షల కు విద్యార్థులను చిన్నప్పుడు నుంచే సన్నాహం ఎలా చేయాలని దానిపైన ఉచితంగా తర్ఫీదు ఇవ్వబో తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాల సంఘం గౌరవ అధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా కోశాధికారి రామచంద్ర, ఉమ్మడి అనంతపురం జిల్లా రవిచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, తాడిపత్రి చంద్రశేఖర్ రెడ్డి, ఆకులేడు శేషాద్రి రెడ్డి, జిల్లా ఉప కార్యదర్శులు తాడిపత్రి బాబయ్య, రాయదుర్గం భాష, శ్రీ చైతన్య నరేంద్ర, సత్యసాయి జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి, వేణుగోపాల్, ఉప కార్యద ర్శిలు బత్తలపల్లి లక్ష్మినారాయ ణ, లక్ష్మి, సోమందేపల్లి వనజ, తాడిమర్రి వెంకటేష్ అలాగే నగర గౌరవాధ్యక్షులు శ్రీవాత్సవ కుమార్, ప్రధాన కార్యదర్శి సుజాత, విజయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జానకి రాములు, రఫీ, గౌరవ సభ్యులు ఈశ్వరి, నూర్జహాన్, సునంద దేవి కళావతి, ఫాతిమా తదితరులు పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క కరస్పాం డెంట్‌కు అకాడమీ వారు ధన్యవాదాలు తెలియజేశారు.

అవగాహన సదస్సుల పోస్టర్లను వవిడుదల చేస్తున్న దృశ్యం

## బాగుందన్నారు...బాడీ అప్పగించారు
### - కిమ్స్ సవేరా వద్ద మృతుని కుటుంబీకులు ఆవేదన

అనంతపురం సిటీ. నఏప్రిల్ 22 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో గాయపడి కిమ్స్ సవేరాకు వస్తే రూ.3లక్షలు కట్టించుకుని ఆరోగ్యం బాగుంది వార్డ్ కు షిఫ్ట్ చేస్తామని చెప్పి చివరకు బాడీని అప్పగిం చారని మృతుని కుటుంబీకులు ఆవేదన వ్యక్తంచే శారు.మృతుని కుటుంబీకుల కథనం మేరకు కళ్యాణదుర్గం మండలం కొత్తూ రుకు చెందిన బోయ మంజునాథ్ యాక్సిడెంట్ కు గురిఅయ్యి చికిత్స నిమి త్తం నగరంలోని కిమ్స్ ఆసుపత్రికి తీసుకువచ్చామన్నారు.తలకు గాయం కాలేదని ముక్కకు గాయం అయ్యిందని సర్జరీ చేయాల్సి ఉందని చెపితే దాదాపు రూ.3 లు ఉన్న ఆడబిడ్డ బంగారం తాకట్టు పెట్టి,పండిన పంటను తక్కువ ధరకు అమ్మి బ్రతికితే చాలు అని ఖర్చు పెట్టమన్నారు.అయితే మంగళవారం ఉదయం మీ అతను చనిపోయాడు బాడీ తీసుకువెళ్లాలని ఆసుపత్రి సిబ్బంది ఒత్తిడి తీసుకువచ్చారని ఏ విధంగా చనిపోయింది కూడా సరిగా సమాధానం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి వద్ద మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు.కిమ్స్ సవేరాలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని వస్తే డబ్బుపై ఉన్న శ్రద్ధ రోగుల ఆరోగ్య పరిస్థితి గురించి పట్టించు కునే ఆలోచన ఆసుపత్రి యాజమాన్యంకు లేదని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు.

కిమ్స్ సవేరా ఆసుపత్రి వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న మృతుని బంధువులు

## ప్రపంచ భూమి దినోత్సవం.. మన శక్తి, మన గ్రహం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

సోమవారం ప్రపంచ భూమి దినోత్సవం పురస్కరించుకుని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, అనంతపురం వారి ఆధ్వర్యంలో, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, అనంతపురం వారి సహకారంతో సోమవారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి బి.వై.ముని ప్రసాద్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, అనంతపురం ప్రిన్సిపల్ డాక్టర్ పి.పద్మశ్రీ మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి, భూమి, గాలి, నీరు, వృక్ష జీవితం, జంతువుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సంవత్సరం థీమ్ మన శక్తి, మన గ్రహం.. విద్యార్థులు భవిష్యత్తుకు నాయకులుగా ఉన్నందున, ఏకమాత్ర వాడే ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించబడినదని, అందరూ కచ్చితంగా పాటించాలని తెలియజేశారు. ఏపీపీసీబీ అధికారులు పి.ఉమ మల్లేశ్వరి, ఎన్. మహేష్ గారులతో పాటు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు బాలాజీ నాయక్ శ్రీమతి విష్ణుప్రియ, జువాలజీ లెక్చరర్ రాజశేఖర్ పాల్గొన్నారు. ఇది మాత్రమే కాకుండ ఎబివిపి ఆధ్వర్యంలో పక్షులకోసం చెట్లమీద మట్టిపాత్రలను కట్టి వాటిల్లో నీళ్లు పెట్టడం జరిగింది. కాగా వాటిలో రోజు నీళ్లు నింపే బాధ్యాతను ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు అజయ్ కుమార్, అశోక్, చంద్ర శేఖర్, వెంకట సాయి తధితర విద్యా ర్థులు తీయడం జరిగింది. ఐతే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రశాం త్, భైరవ, మురళీ కృష్ణ, తిప్పేస్వామి, బసవరాజు, మల్లికార్జున, తది తర విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్ర మంలో చురుకుగా పాల్గోనడం జరిగింది.

మొక్కలు నాటుతున్న దృశ్యం

## 'మున్సిపల్' స్కూల్స్ స్వీపర్లు, వాచ్‌మెన్ల జీతాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి - ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిషనర్‌కు వినతి

అనంతపురం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

నగరంలోని ఉన్నత,ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు, వాచ్‌మెన్‌ల వేతనాలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ మంగళవారం నగర కమిషనర్ బి.బాలస్వామిని కలిసి వినతి చేశాడు. రాజేష్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వాచ్‌మెన్లు, స్వీపర్లతో పనిచేయించుకుంటూ పార్ట్‌టైమ్ తరహాలో కేవలం రూ.4వేలు మాత్రమే వేతనం ఇవ్వడం, ఈ వేతనం కూడా సక్రమంగా ఇవ్వకపోవడం దారుణం అన్నాడు. వీరికి గత మూడు నెలల వేతనం ఇవ్వలేదని, కొందరి వేతనాలు ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో వేయడం వల్ల వారు సక్రమంగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నాడు. 10 ఏళ్లు సర్వీసు వున్నవాళ్లందరినీ ప్రభుత్వం పర్మినెంట్ చేయాలన్న ఉత్తర్వులు వున్నా వాటిని అధికారులు అమలు చేయడం లేదని ఆయన వాపో యాడు. ఈ వినతి చేసిన వారిలో ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, మునిపల్ వర్కర్స్ యూని యన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు అసేన్; నాగభూషన ం, కుళ్లాయప్ప, శివా, నాగేంద్రబాబు, తిరమలయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

## ఉద్యానశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను స్దఇ్వనియోగం చేసుకోండి
### - ఉద్యానశాఖ అధికారి శైలజ

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ఉద్యానశాఖ ఎంఐడిహెచ్చ్ పథకం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖ అదికారి శైలజ అన్నారు. మంగళవారం రెడ్డిపల్లి పరిదిలోని బుక్కరాయసముద్రం,శింగనమల మండల రైతు సేవా అధికారులకు బుక్కరాయసముద్రంలోని వెలుగు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగ వారు మాట్లడుతూ ఈ ఆర్థిక సంవత్సరం 2025-26గాను ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించడమైనది.గత సంవత్సరం ఖరీఫ్,రబీ పంట నమోదు చేసిన ఉద్యాన పంటల వివరాలను ఇవ్వవలసిందిగా రైతుసేవి కేంద్రం అదికారులకు ఆదేశాలు జారీచేశారు.తక్కువ నీటితో అధిక దిగుబడులు నిచ్చే నూతన పండ్లతోటల పెంపకంలో భాగంగా డ్రాగన్‌ఫ్రూట్,అవకాడో, అంజుర,నేరేడు, బొప్పాయి, ద్రాక్ష,మామిడి, పంటల సాగుచేసుకున్న రైతులకు40% రాయితో 3 సంవత్సరాలవరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు.గత సంవత్సరం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను సేకరించాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న పండ్ల తోటలకు ఫారం పండ్లు యూనిట్లను మామిడి, చిని, ఇతర పండ్లమొక్కల అంట్లు మొక్కల ఉత్పత్తిని పెం పొందించేందుకు సర్సీరీ యూనిట్లు పాలిహౌస్ షేర్‌నెట్ నిర్మాణాలకు 50% రాయితో ఇస్తున్నట్లు తెలిపారు .మార్కెటింగ్ అనుకూలంగా 35% కోల్డ్‌స్టోరేజ్ రూమ్‌వంటి నిర్మాణాలకు రాయితీలు ఇస్తున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో వారితోపాటు, రెండుమండలాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లడుతున్న ఉద్యానశాఖ అధికారి శైలజ

## ప్రజారోగ్యాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి
### - ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మినారాయణమ్మ - ముగిసిన పోషణ పక్వాడ పక్షోత్సవాలు

పామిడి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ప్రజారోగ్యాల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మినారాయణమ్మ పేర్కొన్నారు. ఐసీడీఎస్ సిడిపిఓ భారతి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ లక్ష్మినారాయణమ్మ ఆధ్వర్యంలో మండల పరిదిలోని సోరకాయలపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడ పక్షోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా సూపర్‌ఎైజర్ లక్ష్మినారాయణమ్మ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతిఒక్కరూ పౌష్టికాహారాన్ని తీసుకుంటూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. గర్భవతులు, బాలింతలు శక్తినిచ్చే ఆహారా పదార్థాలను తీసుకోవా లని సూచించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని తెలియజేస్తూ పౌష్టికాహారాన్ని తీసుకోవటం ద్వార కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. 6 నెలలలోపు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. 6 నెలల నుండి 3 ఏళ్ళలోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించటంపై క్షుణ్ణంగా వివరించారు. కళాజాత బృందం గేయాలను ఆలపిస్తూ ప్రభుత్వ పథకాలపై అవగాహణ కల్పించారు. అనంతరం గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు చేశారు. ఈకార్యక్ర మంలో అంగన్‌వాడి కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

గర్భవతికి శ్రీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మినారాయణమ్మ

ప్రభుత్వ పథకాలపై అవగాహణ కల్పిస్తున్న కళాజాత బృందం

## వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

జాతీయ గ్రామీణ ఉపాధి హామి చట్టాన్ని రక్షించండి అని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాంలో కష్టజీవుల పాదయాత్ర నార్పల మండలం బండ్లపల్లి గ్రామం నుండి అనంతపురం వరకు చేపట్టారు.ఈ పాదయాత్రలో వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జల్లివిల్సన్, మాజి ఎంఎల్ఎ రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్,అధ్యక్షులు కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు వెంకటరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పాలెం నారాయణ స్వామి, మల్లికా ర్జున,శింగనమల నియోజకవర్గం కార్యదర్శి టి.నారాయణస్వామి,బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి కె.మధ్రిస్వామి, సహాయకార్యదర్శి శ్రీనివాసరావు,చిన్నతిరుపతయ్య,మండల కార్యవర్గ సభ్యులు నాగేంద్ర,ఈశ్వర్,సుబహాన్,పెద్దతిరుపతి, బాబాఫక్రుద్దీన్, రామాంజినేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగ వారు మాట్లడుత 2005లో యూపీఏ కేంద్ర ప్రభుత్వం వామపక్షపార్టీల మద్దతుతో వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు దీర్ఘకాలిక ఆందోళనలు పోరాటాల ఫలితంగా గ్రామీణ పేద కష్టజీవులు పనులులేక వల స లు, ఆకలిచావులు నివారిం చేందుకు సంవత్సరంలో 100 రోజులు పనులు గ్యారెంటీ కల్పించే అలక్షంతో ఉపాది హామి పథకాన్ని అమలు పరిచారు. జాతీయ ఉపాది హామి పథకాన్ని సక్రమంగా అమలుచేయాలి ప్రతి ఉపాది కూలికి రోజుకి 700 రూపా యలు కూలిపడాలి 200 వందలరోజులు పనిదినాలు కల్పించాలి,ఉపాది భృతిగా ప్రతి కూలీకి ఏడాదికి 12వేల రూపా యలు అందించాలన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న సిపిఐ నాయకులు

## నేడు సినీ సంగీత విభావరి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ఈ నెల 23న 2024-25 విద్యా సంవత్సర ముగింపు సందర్భంగా, ప్రముఖ తెలుగు చలన చిత్ర గాయని, దక్షిణ భారత గాన కోకిల జానకి జన్మదిన సందర్భంగా స్థానిక "అనంత ఉపాధ్యాయ కళా సమితి" ఆధ్వర్యంలో స్థానిక ఆఫీసర్స్ క్లబ్ సాయత్రం 6 గంటల నుండి " సినీ సంగీత స్వర చక్రవర్తికి గురువుల గళ నివాళి" సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామని, ఇందులో నాటి సినీ సంగీత దర్శకుడు స్వర్గీయ చక్రవర్తి స్వరాలు సమకూర్చిన చిత్రాల నుంచి జానకి సుశీల పాడిన ప్రజాదరణ పొందిన పాటలను పాడి అలరిస్తారు. కావున నగరంలోని సినీ సంగీత ప్రియులు, చక్రవర్తి, జానకమ్మ అభిమానులు, ఉపాధ్యాయులు అందరూ విచ్చేసి అలనాటి మధుర గీతాలను ఆస్వాదించి ఆనందించాలని " అనంత ఉపాధ్యాయ కళా సమితి" అధ్యక్షులు బాలమురళీ కృష్ణ, కార్యదర్శి రామాంజి, కోశాధికారి చంద్రమౌళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## నాటు సారా తో దుష్ప్రభావాలు అనేకం
### ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ

అనంతపురం వైద్యం ఏప్రిల్ 22 ప్రభాతవాన్తాటు సారా తయారు చేస్తూ పట్టుబడితే భారీ జరిమానా తో పాటు కేసు నమోదు అవ్వడమేకాక నాటు సారా సేవించడం వల్ల అనారోగ్య పాల వుతారని నాటుసారాతో దుష్ప్రభా వాలు అనేకం ఉన్నాయి దీనిని ప్రజలు గ్రహించి నాటు సారా తయారీని ,సేవించడానికి మానుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఆత్మ కూరు మం డలం వేపచెర్ల ఎగువ తాండా , దిగువ తాండ గ్రామాల్లో దాడులు నిర్వహించి, అనుమానిత ప్రాంతాల్లో నాటుసారా బట్టీలను పెట్టకుండా , గతంలో నాటు సారాయి కేసుల్లో ఉన్న వ్యక్తుల ఇళ్ళను విస్క్ రృతంగా తనిఖీ చేశారు.

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

## శ్రీ అక్కల్‌కోట్ మహారాజ్ ఆరాధనోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

అనంతపురం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త బ్యూరో

స్థానిక హెచ్ఎల్సీ కాలనీలోని శ్రీ కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారు, శ్రీ వలి స్వామి ఆశ్రమంలో శ్రీ సమర్థ సద్గురువు అక్కల్‌కోట్ మహారాజు ఆరాధన ఉత్సవం నిర్వహిస్తున్నట్లు విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కల్కోట్ మహారాజ్ 147వ ఆరాధన ఉత్స వాలు 26వ తేదీన శనివారం ఉదయం ఆలయంలోని శ్రీ మహాల క్ష్మిఅమ్మవారికి, అక్కల కోట్ మహారాజుకు పండితులు సుంకేసుల సత్యనారా యణశర్మచే పంచామృత అభిషేకాలు, హోమాలు, విశ్రాంత ఉపాధ్యాయిని డా.పాణ్యం వసుంధర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహా మంగళ హారతి అనంతరం భక్తులకు ప్రసాద వినియోగము. సాయంత్రం నగరోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వా మివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న సభ్యులు

## కెజిబివి నాన్ టీచింగ్ పోస్టుల దరఖాస్తుకు ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

అన్ని మండలాల్లోని కెజిబివి (కస్తూర్బా గాంధీబాలికా విద్యాలయాలు) లోని నాన్ టీచింగ్ పోస్టుల కొరకు దరఖాస్తు చేసుకొను అభ్యర్థులు మే 1వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని ఇతర వివరాలకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వాటిని పరిశీలించి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ తీసి వివరాలను నింపి అవసరమైన పత్రాలతో కూడిన దరఖాస్తులను సంబంధిత మండల తహశీల్దారుకు గడువులోపు పంపాలని అనంతపురం జిల్లా ఏపి సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

## జాతీయస్థాయి బేస్బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

2025 ఏప్రిల్ 22 నుండి 27వరకు ఢిల్లీలో జరిగే స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్-17 బేస్బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి పి.మోహన్ పదవతరగతి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల బుక్కరాయ సముద్రం. క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలకు పాల్గొనడానికి వెళ్లాడు.గత సంవత్సరం నవంబర్ 9 నుండి 11 వరకు గుంటూరు జిల్లా యనమ దల లో జరిగిన స్కూల్‌గే మ్స్ ఫెడరేషన్ అంతర్‌జిల్లా అండర్-17 బేస్బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు రాష్ట్రం తరుపున ఎంపికైనారు.జాతీయ స్థాయిలో పోటీల్లో విజయం సాదించి తిరిగిరావాల నిపాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుందర,పిడి గోపాల్‌రెడ్డి,లలితమ్మ ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించారు.

జాతీయ స్థాయి పోటీలకు 

04ATP31_04ATP31.qxd 22-04-2025 PM 10:55 Page 1



# రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తోంది

## - వైకాపా ప్రభుత్వం కంటే ఎక్కువ అప్పులు చేస్తోంది - విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారుల పేరుతో బాదుడు - మే 2న ప్రధాని మోడీ రాష్ట్ర విభజన హామీలపై స్పందించాలి - కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి ధ్వజం

అనంతపురం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలిందని, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై బాదురు కార్యక్రమం చేస్తుందని, వైసీపీ ప్రభుత్వం కంటే ఎక్కువ అప్పులు చేస్తోందని మాజీ రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి ధ్వజమెత్తారు. వైకాపా, టిడిపిలు రాష్ట్రానికి రాహు కేతువులుగా దాపురించాయని, రెండు పార్టీలు దొందూ దొందే అన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జగన్ అర చేతిలో వైకుంఠం చూపిస్తే..చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు, వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మధ్య, జూద, డ్రగ్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్‌గా తయారు చేసి వెళ్లి పోయిందన్నారు. అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లుంది చంద్రబాబు ప్రభుత్వం పని తీరు ఉందన్నారు. మండలానికి నాలుగు మద్యం షాపులు నలభై బెల్టు షాపులు అన్నట్లు మద్యం పాలసీ తయారైందన్నారు.

పాఠశాలల్లో కూడా డ్రగ్స్, గంజాయి ప్రవేశించాయన్నారు. అప్పుల విషయంలో కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్నట్లుంది అని చెప్పారు. బాదుడు కార్య క్రమం భారీగా సాగుతోంది అని, సర్దుబాటు చార్జీల పేరు తో రు 15,485 కోట్ల అదనపు భారం మోపిందని ఆయ న ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అ య్యాయి. నిరుద్యోగ భృతి ఇస్తా మని చెప్పి ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వ లేదు అని, యువతను నమ్మించి మోసగించడం జరిగింది అన్నారు. వైద్య విద్యను అమ్మకానికి పెట్టింది అని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు వైద్య విద్యను లేకుండా చేసింది అని ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్ర సచివా లయం విషయంలో డబ్బు దుర్వినియోగం జరుగు తోంది అని, కేవలం రూ. 616 కోట్లతో తెలంగాణా రాష్ట్ర సచివాలయాన్ని అద్భు తంగా నిర్మించారు కానీ ఆంధ్రప్రదేశ్ తాత్కాలిక సచివాలయానికి రూ.1151 కోట్లు ఖర్చు చేశారు. మళ్ళీ రూ.4689 కోట్లు అప్పు తెచ్చి పర్మినెంట్ బిల్డింగ్ అంటూ ఇప్పుడు నిర్మాణాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 2015 అక్టోబర్ 22న ప్రధాని మోడీ రాజధాని అమరావతికి శంఖు స్థాపన చేశారు. మళ్ళీ 2025 మే 2న శంఖు స్థాపన చేయబో తున్నారు అని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర యువజన హామీలపై ప్రధాని మోడీ స్పందించాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ చైర్మన్ దాదా గాంధీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే శంకర్, జిల్లా ఓ.బి.సి. చైర్మన్ రామ్ చరణ్ యాదవ్, సేవాదళ్ నాయకులు హరి రాయల్, సీనియర్ నాయకులు కొండారెడ్డి, ప్రసాద్ రెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసి రెడ్డి

# మానవ జీవితాన్ని సుసంపన్నం చేయటమే శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ లక్ష్యం

## - అధ్యాత్మికతతోనే మానశిక ప్రశాంతత - గీతా మహా యజ్ఞంలో బాగస్వాములై పామిడి కీర్తిని చాటండి - శ్రీశ్రీ గురు దత్త సేవా సమితి సభ్యులు ఎన్.ఎస్.ఎం.శ్రీధర్

సంపూర్ణ భగవద్గీత స్మరణలో పథకాలు సాధించిన ఎన్.ఎస్.ఎం.జయలక్ష్మి, ఎన్.ఎస్.ఎం.జ్ఞానదత్త, ఎన్.ఎస్.ఎం.గీతాశ్రీధర్, సర్వదే ఉమాచితంబరి.

పామిడి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

మానవ జీవితాన్ని సుసంపన్నం చేయటమే అవదూత మైసూరు దత్తపీఠాధిపతి గురువులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ లక్ష్యం అని శ్రీశ్రీ గురు దత్త సేవా సమితి సభ్యులు ఎన్.ఎస్.ఎం.శ్రీధర్ పేర్కొన్నారు. సంపూర్ణ నరశీ మద్భగవద్గీత 700 శ్లోకాల కంఠస్థం 10 వేల మందితో సామూహిక పారాయణం అవదూత మైసూరు దత్తపీఠాధిపతి గురువులు శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ దివ్య సంకల్పం అని అందువల్ల ప్రతిఒక్కరూ గీతా మహా యజ్ఞంలో బాగస్వాములై పామిడి కీర్తిని వెలుగెత్తి చాటాలని మంగళ వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీశ్రీ గురు దత్త సేవా సమితి సభ్యులు ఎన్.ఎస్.ఎం.శ్రీధర్ పిలుపునిచ్చారు. పామిడి శ్రీ అనఘా ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం, శ్రీశ్రీ గురు దత్త సేవా సమితి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో ఈ మహాయజ్ఞంలో బాగస్వామ్యం అవుతోందని 2019లో 13 ఏళ్ళ వయసులో ఎన్.ఎస్.ఎం.జయలక్ష్మి, 2021లో 7 ఏళ్ళ వయసులో ఎన్.ఎస్.ఎం.జ్ఞానదత్త, 2022లో ఎన్. ఎస్.ఎం .గీతా శ్రీధర్ ఇప్పటికే స్వామీజీ స్వర్ణ హస్తాల మీదుగా స్వర్ణ పథకాలను అందుకున్నారని ప్రస్తుతం సర్వదే ఉమాచితంబరి ఈనెల 15న మైసూరు దత్త పీఠం వారు నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులై స్వామీజీ స్వర్ణ హస్తాల మీదుగా స్వర్ణ పథకాన్ని అందుకోవటం శుభపరిణామం అన్నారు. అధ్యాత్మికతతోనే మానశిక ప్రశాంతత లభిస్తుందని తెలియజేస్తూ మానవ జీవితంలో ప్రతిఒక్కరికీ ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి నిత్యం భగవద్గీత పఠనం చేయాలన్నారు. దేవుడు మనకు ప్రతిదీ ఉచితంగా అందిస్తున్నాడని అందువల్ల మనం దరం ఆయనను భక్తిభావంతో పూజిస్తే మనలో కొలువైన దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకోవటమే అన్నారు.

ఆధ్యాత్మిక వృద్ధి, శాంతి, ప్రాచీన దైవిక సాంప్రదా యాలను ప్రోత్సహిస్తున్న స్వామీజీకి భగవద్గీతతో లోతైన అనుబంధం ఉందని భగవద్గీత బోధనలను వ్యాప్తి చేయటానికి ఆయ న గణనీయమైన కృషి చేశాడని వివరించారు. స్వామీజీ భగవద్గీతలోని ప్రాచీన జ్ఞానాన్ని అందించటమే కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా చేసిందన్నారు. స్వామీజీ భవిష్యత్తు సంపూర్ణ శ్రీ మద్భగవద్గీత పారాయణ మహావేధికలో బాగస్వాముల అవ్వటానికి ఆసక్తి ఉన్నటువంటి వారంతా మైసూరు శ్రీ దత్త పీఠం వారు నిర్వహిస్తున్న గీతా పారాయణం, స్మరణం నేర్చుకోవటానికి ఆన్‌లైన్ ద్వార ఎన్.ఎస్.ఎం.గీతా శ్రీధర్, పామిడి శ్రీశ్రీ గురు దత్త సేవా సమితి కార్యవర్గ సభ్యులను సంప్రదించాలని ఎన్.ఎస్.ఎం.శ్రీధర్ వెల్లడించారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలను పరామర్శించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

సత్య సాయి జిల్లా వైద్యము ఏప్రిల్ 22 ప్రభాతవార్త

టీడీపీ కార్యకర్తల క్షేమమే తన ప్రథమ ధ్యేయమని పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బుక్కపట్నం మండలం రాసింపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వీరభద్ర, భాస్కర్ నాయక్‌లను ప్రత్యేకంగా పరామర్శించారు. ఉపాధి హామీ కూలి పనులనుంచి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురైన వీరుభద్ర, భాస్కర్ నాయక్ కాలు విరగడంతో ప్రస్తుతం అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయము తెలుసుకున్న మాజీ మంత్రి ఆసుపత్రి సూపరిండెంట్ వెంకటేశ్వరరావుతో కలిసి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. వారికి మెరుగైన వైద్యం అందించాలంటూ వైద్యాధికారులకు సూచించారు. త్వరగా కోలుకొని సక్రమ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. కార్యకర్తలు ఎటువంటి సమస్యల్లో ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని విధాలా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు స్థానిక టీడీపీ నాయకులు వెంకట రాముడు, నరేష్ తదితరులు ఉన్నారు. అనంతరం అనంత పురం బస్టాండ్ సమీపంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నల్లమడ మండలం వెళ్ళమద్ది గ్రామానికి చెందిన లక్ష్మన్న భార్య సరోజ మ్మను కూడా డాక్టర్ పల్లె పరామర్శించారు. కాలు ఆపరేషన్ అనం తరం ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆమెకు అవసరమైన మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులను కోరారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు అభిషేక్, లక్ష్మన్న, ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలను పరామర్శిస్తున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

# ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ సీనియర్ నేత విష్ణు వర్ధన్ రెడ్డి

అనంతపురం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త బ్యూరో

బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్.విష్ణు వర్ధన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును మంగళవారం ఢిల్లీలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 20 సంవత్సరాల విశిష్ట సేవలను విశ్లేషించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆయనకు బహూకరించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో మీడియాతో ప్రతినిధులతో మాట్లాడిన విష్ణు వర్ధన్‌రెడ్డి మే 2న ప్రధాని మోదీ అమరావతి పర్యటనలో భాగంగా దాదాపు రూ.50 వేల కోట్ల నిధులతో ప్రారంభం కాబోతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రజలకు ఎంతో శుభసూచకమై ఉంటాయి. అమరావతిని ఆంధ్రప్రదేశ్ ప్రజల స్వప్న నగరంగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి పట్టుదలతో పాటు, ప్రధానమంత్రి మోదీ గారి సహకారం కూడా కీలకంగా ఉంది అని అన్నారు. అలాగే ముఖ్యమంత్రి ఇటీవల ప్రవేశపెట్టిన పి4 పథకం పేదల అభివృద్ధికి మార్గ దర్శక ంగా నిలుస్తుందన్న వి శ్వాసాన్ని వ్యక్తం చేశా రు. ఈ పథకం ధనవంతుల సహకారంతో పేదల జీవన ప్రమా ణాలను మెరుగుపర చడమే లక్ష్యంగా రూపొందించబడిందని పేర్కొన్నారు. ఇది పేదరిక నిర్మూలనలో గేమ్ ఛేంజర్ అవుతుందని అభిప్రాయపడ్డారు.



సీఎం చంద్ర బాబుకు పుస్తకాన్ని బహుకరిస్తున్న బిజెపి నేత విష్ణు వర్ధన్ రెడ్డి

# కెజిబివిల్లో ఉద్యోగాల కొరకు దరఖాస్తు చేసుకోండి

## - ఎంఈఓలు నరసింహరాజు, శివ ప్రసాద్

శింగనమల, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని కెజిబివిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నరసింహరాజు, ఎంఈఓ-2 శివ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం వారు మండల కేంద్రంలోని ఎమ్మార్సి కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. వారి వివరాల మేరకు కెజిబివి టైప్-3 శింగనమలలో హెడ్‌కుక్-1, అసిస్టెంట్‌కుక్-3, వాచ్‌మెన్-1, కెజిబివి టైప్-4 హాస్టల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శింగనమలకు అనుబంధం)లో చౌకీదార్-1, హెడ్‌కుక్-1, అసిస్టెట్‌కుక్-1 మొత్తం 9 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఈ నెల 30లోపు మండల కేంద్రంలోని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. 1-7-2024 నాటికి 42 సంవత్సరాల వయస్సు, ఎస్సీ, ఎస్టీ, బిసి, ఈడబ్ల్యూఎస్ వారికి 47 సంవత్సరాలు, వికలాంగులు, గరిష్ట వయోపరిమితి 52 సంవత్సరాలు, మాజీ సైనిక్ మహిళలకు 45 సంవత్సరాలు నిర్ధారించడమైందన్నారు. పై పోస్టులకు కేవలం స్థానిక మహిళలు, స్థానిక గ్రామం, మండలానికి చెందిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేవలం శింగనమల మండలం నివాసితులు మాత్రమే అర్హులు అన్నారు.

నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఈఓలు నరసింహరాజు, శివ ప్రసాద్

# ఆరోగ్య సమాజ నిర్మాణమే లక్ష్యం - కలెక్టర్ టి.ఎస్. చేతన్

పౌష్టికాహార పక్షోత్సవ సభలో మాట్లాడుతున్న కలెక్టర్

పౌష్టికాహార గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

సత్యసాయి జిల్లా వైద్యము ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ఆరోగ్యమైన పిల్లలతో ఆరోగ్య సమాజ నిర్మాణమే పోషణ అభియాన్ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ తెలి పారు. మంగళవారం పుట్టపర్తి లోని సాయిఆరామంలో మహిళా భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్వాడ (పోషకాహార పక్షోత్సవాల) ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2019లో ప్రారంభమైన పోషణ్ పఖ్వాడా కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రతి ఏప్రిల్‌లో 15 రోజులపాటు నిర్వహించబడు తుందని తెలిపారు. ఈ ఏడాది కార్యక్రమాల్లో "జీవితంలో మొదటి 1000 రోజులు"పై ప్రత్యేక దృష్టితో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నా రు.గర్భిణీ స్త్రీలు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవడం, నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవడం, డెలివరీ ప్రభుత్వాసుపత్రి లో జరిపించుకోవడం కీలకమని అన్నారు.

శిశువు పుట్టిన వెంటనే ముర్రు పాలు, 0 డోస్ వ్యాక్సిన్ ఇవ్వాలని, ప్రతి నెల బాలల బరువు, ఎత్తు చెక్ చేయాలన్నారు. సరైన పోషకాహారం తోపాటు పరిశుభ్రమైన ఆహారం వల్ల పోషకాహార లోపం నివారిం చవచ్చని వివరించారు. బాల్యంలో ఊబకాయ నివారణ, పోషక మైన ఆహార ఎంపికలపై అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాలు, గిరిజన తండాలలో చైతన్య కార్యక్ర మాలు విస్తృతంగా చేపట్టా లని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా పిల్లల కు అన్నప్రాసన, సామూహిక శ్రీమంతాల కార్యక్రమాలు నిర్వహించబ డ్డాయి. అనంతరం పోషకాహార గోడపత్రికను ఆవిష్కరించారు. అలాగే ఐసిడి ఎస్ శాఖ నిర్వహి స్తున్న పోషక ఆహార స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీవో సువర్ణ, డిఆర్డిఏ పిడి నరసయ్య, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డీఎంహెచ్ఓ పైరోజా బేగం, విద్యా శాఖ అధికారి కృష్ణయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుండి పాఠశాలలకు వేసవి సెలవులు

## - తిరిగి జూన్ 12న పున:ప్రారంభం - ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ కమిషనర్

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

2024-25 విద్యా సంవత్సరం ఈనెల 23వ తేదీతో ముగియనుంది. 24వ తేదీ నుండి జూన్ 11వ తేదీ వరకు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్ బాబు తెలిపారు. తిరిగి జూన్ 12వ తేదీ పాఠశాలలు పున:ప్రారంభం అవుతాయన్నారు. అదేవిధంగా హాస్టల్స్ కూడా వేసవి సెలవులు ఇస్తున్నామని, నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయినప్పుడు హాస్టల్స్ కూడా పున :ప్రారంభం అవుతాయని ఎస్సీ వెల్ఫేర్ డిడి రాధిక, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి రామాంజనేయులు తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

# న్యూఢిల్లీకి వెళ్లిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. యుపిఎస్‌సి ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్ష 2025 మే 25వతేదీకి షెడ్యూల్ చేయడం జరిగింది. న్యూఢిల్లీలోని యుపిఎస్‌సి, ఎంపి హాల్‌లో ఈనెల 23వతేదీన బుధవారం సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలకు సంబంధించి యుపిఎస్‌సి సన్నాహక సమావేశం నిర్వహించనుండగా, అనంతపురం జిల్లా నుండి ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ హాజరుకానున్నారు. భారతదేశం లోని 77 జిల్లాల నుండి జిల్లా కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొననుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం జిల్లాల నుండి ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

# సిసి కెమెరాలు ఏర్పాటులో వ్యాపారవేత్తలు భాగస్వామ్యం కావాలి

## - రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో కమిషనర్, డిస్పీలు పిలుపు

అనంతపురం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

నగరంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడంలో వ్యాపారవేత్తలు భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా వుందని నగర కమిషనర్ బి.బాలస్వామి, నగర డిఎస్పీ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశపు హాలులో కమిషనర్ అధ్యక్షతన నిర్వహించిన రోడ్డు సేఫ్టీ కమిటి సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు షాకీర్ హుసేన్‌లతో పాటు 'మున్సిపల్', పోలీసు, వ్యాపార వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిబ్రవరి2,2025న రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, చైర్మన్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. నగరంలో దాదాపు 40 ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని, ఈ మేరకు వ్యాపారవర్గాలు తమవంతు సహాయం అందించడానికి ముందుకురావాల్సిన అవసరం వుందన్నారు. నగరప్రజల భద్రత దృష్టా పోలీసు శాఖ ప్రధాన కూడళ్లను గుర్తించిందని ఈ మేరకు సిసి కెమెరాలు అమర్చాల్సిందన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య, క్రైమ్‌ను అరికట్టడానికి దోహదపడుతాయని, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినవారమైతామన్నారు. సమావేశానికి హాజరైన లక్కీ-9 హోటల్ యజమాని సుధాకర్‌రెడ్డి,లోవరాజ్, మనప్పురం జువెలరీ మేనేజర్‌లు సామాజిక బాధ్యతలో భాగంగా రెండు కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం పట్ల డిఎస్పీ, కమిషనర్‌లు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మరికొందరు తమ యాజమానులతో మాట్లాడి సహకారం అందిస్తామని హామి ఇచ్చారు. నగరంలో పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు వున్నారని, నగర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తమ వంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందించాలని వారు పిలుపునిచ్చారు.

రోడ్డుసేఫ్టీ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, వేదికపై డిఎస్పీ, ఎస్ఈ,ఈఈలు

# విద్యార్థులకు అందించిన సేవలే చిరకాలం గుర్తుంటాయి

## - మైనుద్దీన్ పదవి విరమణ సభలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయునికి సన్మానం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు

కదిరి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

విద్యార్థిని, విద్యార్థులకు విధుల పట్ల ఉపాధ్యాయులు అందించినసేవలు చిరకాలం గుర్తుంటాయని, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్ర, ప్రధాన కార్యదర్శి సుధాక ర్‌లు పాల్గొన్నారు.మున్సిపల్‌ప్రాథమిక పాఠశాలలోని గంగిరెడ్డిపల్లిలో ఉపాధ్యాయుడుగా, ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తునన్న బి.మైనుద్దీన్ పదవీ విరమణ కార్యక్రమం పట్టణంలోని పరమేశ్వరి థియేటర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్దయర్శిగా, జిల్లాప్రధాన కార్యదర్శి మండల విద్యాధికారులు ముఖ్య అతిథులుగా హాజరై ఆయన విద్యార్థులకు అందించినసేవలు, ఉపాధ్యాయ సంఘం నాయకులుగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాడిన తీరును కొనియాడారు. అనంతరం మైనుద్దీన్ దంపతులకు ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు,పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రైవేట్ విద్యా సంస్థల అధినేతలు, దుశ్శాలువాతో పూల బొకేలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు

అనంతపురం వైద్యం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఈ నెల 24 25 26వ తేదీలలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వెరిఫికేషన్ కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంటెంట్ కే ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈనెల 24న, సత్యసాయి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు 25వ తేదిన, 26వ తేదీన పై రెండు తేదీలలో వివిధ కారణాలతో గైర్హజరైన ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లాకు చెందినవారు హాజరై సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుండి 4 గంటల వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరుగుతుందని క్యాన్సర్ తో బాధపడుతున్న వారు డిఈ ఐ సి లో, పీడియాట్రిక్, సైక్రియాట్రిక్ ,ఆర్థోపెడిక్ వ్యాధిగ్రస్తులు బర్నింగ్ వార్డులో, విజువల్ ఛాలెంజెడ్ బాధితులు ఆప్తమాలజీ విభాగంలో, హియరింగ్ ఇంపార్డు ఉన్నవారు ఈఎన్టీ విభాగంలో , గుండెసంబంధ వ్యాధులు, న్యూరో బాధితులు సైక్రియాటిక్ వార్డులో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ కు వచ్చే ఉపాధ్యాయులు తమ పాత మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు తో పాటు, లేటెస్ట్ మెడికల్ రిపోర్ట్స్ తో హాజరుకావాలని పేర్కొన్నారు.